


TGTEL/25/A3149

# ఈకాలం

వార్త తెలుగు దిన పత్రిక TELUGU DAILY

**రిపోర్టర్లు కావలెను**

'ఈకాలం వార్త' తెలుగు దిన పత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం**

ఆసక్తి గల వారు ఈ కింది నెంబర్లను సంప్రదించండి

**8688339954**

**7013439800**

| సంపుటి : 1 | సంచిక : 29 | చీఫ్ ఎడిటర్ : దేవేందర్ నూకల | గురువారం | 20 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల: 2



# పుట్టపర్తి పవిత్ర భూమి

## అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని

సాయి బోధించిన ప్రేమ, సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శమని వ్యాఖ్య

ఆయన భౌతికంగా లేకున్నా మనతోనే ఉన్నారు

ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచాయి

పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ

**హైదరాబాద్, నవంబర్ 19:**

సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతి రూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్య సాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్ధిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి ..మిగతా 2లో



# మహిళల ఆత్మగౌరవానికి కోటి చీరలు

గ్రామాల్లో డిసెంబర్ 9కి పంపిణీ పూర్తి

పట్టణాల్లో మార్చి 1–8 వరకు

మహిళల వివరాలతో భవిష్యత్ పథకాలకు బేస్ డేటా

పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యాజమాన్యంలో మహిళలకు ప్రాధాన్యం

ఆడబిడ్డలకు ఆర్థిక ఉన్నతి ప్రధాన లక్ష్యం

మహిళా నేతలు, అధికారులు ఇందిరమ్మ చీర ధరించాలి

సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

## ఆడపడుచులకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం

**హైదరాబాద్, నవంబర్ 19:**

తెలంగాణలో మహిళా సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటున్న రేవంత్ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో 'ఇందిరమ్మ చీరల పంపిణీ'ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇందిరాగాంధీ పాలనలో అమలైన ప్రజా ప్రయోజక పథకాలకు స్ఫూర్తిగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఇందిరాగాంధీ విగ్రహానికి సీఎం నివాళి**

కార్యక్రమం నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్ప మాల అర్పించడం ద్వారా ప్రారంభమైంది. అనంతరం ఆయన ప్రజల్లోకి వెళ్లి స్వయంగా పలువురు మహిళలకు ఇందిరమ్మ చీరను ..మిగతా 2లో

## ఓటర్ జాబితా సవరణపై ఈసీ ఆదేశాలు

ఓటరు జాబితా సవరణకు షెడ్యూలును ప్రకటించిన ఎన్నికల సంఘం

ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ

జిల్లా పంచాయతీ అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు



3

## కాంగ్రెస్‌కు ఓటేస్తే పంచాయతీలకు నయా పైసా రాదు..

హిందుత్వమే నా శ్వాస...

రామరాజ్యం తెస్తాం...

హుజూరాబాద్‌లో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



3

## సింగరేణి ముట్టడి ఉద్రిక్తం

జాగృతి నేతలు, పోలీసుల మధ్య తోపులాట

బైఠాయించిన కవిత

కవిత అరెస్టు, నాంపల్లి పీఎస్ కు తరలింపు

మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలి

సింగరేణిలో ఇండిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించాలి

జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత డిమాండ్



3

## నేనొక్కడినే.. ఏం చేసుకుంటారో చేసుకోండి..

10 దేశాలకు పైరసీ, బెట్టింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించిన వైనం

కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

ఆదాయంలో 80 శాతం బెట్టింగ్ యాప్‌ల ద్వారానేనని గుర్తింపు

ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి






2

## హిడ్మాను చంపి.. ఎన్‌కౌంటర్ అంటారా

మావోయిస్టులపై దాడులను వెంటనే ఆపాలి

సిపిఐ నేత కూనంనేని డిమాండ్



3

## మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం, రాష్ట్రం 50:50 వాటా

నగరంలో అదనంగా 160 కి.మీ. మెట్రో లైన్ల నిర్మాణంపై ప్రతిపాదనలు

విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులను పరిశీలిస్తున్నామన్న కేంద్రం

మూసీ నది అభివృద్ధికి అమృత్ పథకం కింద నిధులు

అమరావతి అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ

**హైదరాబాద్, నవంబర్ 19:**

భాగ్యనగర మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించుకోవాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్‌లో అదనంగా 160 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రులు, ..మిగతా 2లో



# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు



జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కండి

కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా

దొంగ ఓట్లు, అక్రమాలతోనే కాంగ్రెస్ గెలుపు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

జూబ్లీహిల్స్ లో నైతిక విజయం బీఆర్ఎస్‌దే

**హైదరాబాద్, నవంబర్ 19:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించుకున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు. తెలంగాణ భవన్‌లో ..మిగతా 2లో

# మహిళల ఆత్మగౌరవానికి కోటి చీరలు

మొదటిపేజీ తరువాయి

అందజేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున మహిళలు పాల్గొనడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క వంటి అనేక మంది నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగింది.

**డిసెంబర్ 9 లోపు పంపిణీ**

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ మహిళకు ప్రభుత్వం అందజేస్తున్న గౌరవ సూచికమే ఈ చీరల పంపిణీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం కోటి మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నామని ప్రకటించారు. మొత్తం 65 లక్షల మహిళలు బుధవారం నుంచి డిసెంబర్ 9 వరకు గ్రామాలలో పంపిణీ పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. సీఎం మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని బాధ్యతలో పెట్టనున్నట్లు చెప్పారు. పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**భవిష్యత్ పథకాలకూ అనుసంధానం**

చీరలు పంపిణీ చేసే సమయంలో మహిళల వివరాలు సేకరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈ వివరాలు భవిష్యత్‌లో చేపట్టబోయే అన్ని మహిళా సంక్షేమ పథకాలకూ బేస్ డేటాగా ఉపయోగించనున్నట్లు తెలిపారు. చీర ఇస్తూ వారి వివరాలు కూడా తీసుకోండి. ఇది రాబోయే సంక్షేమ పథకాల అర్హతను నిర్ణయించడానికి కీలకం అవుతుంది అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

**మహిళల ఆర్థిక శక్తిపై దృష్టి**

సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగంలో మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ముఖ్యాంశంగా నిలిచాయి. మహిళలకు పెట్రోల్ బంకుల యాజమాన్య హక్కులు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అనేక పెట్రోల్ బంకులను మహిళలకు కేటాయించి వారిని ఆదాయ వనరులతో అనుసంధానిస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులుగా చేశామన్నారు. ఆర్టీసీకి చెందిన 1,000 బస్సులకు మహిళలను యజమానులుగా నియమించడం** తమ ప్రభుత్వ తీసుకున్న ధైర్యవంతమైన నిర్ణయాల్లో ఒకటని అన్నారు.

**మహిళల ఆత్మగౌరవం**

మహిళలు ఆర్థికంగా బలపడే కార్యక్రమాలు మాత్రమే కాదు, ఆత్మగౌరవాన్ని పెంపొందించే కార్యక్రమాలను కూడా చేపట్టామని చెప్పారు. కోటి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడం మా లక్ష్యం'' సీఎం రేవంత్ తన ప్రసంగంలో సుదీర్ఘ దృష్టికోణాన్ని వివరించారు. “ఆడబిడ్డ పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లో మహిళలకు ప్రాధాన్యత పెంచుతున్నాం. తెలంగాణలోని కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడం మా ప్రభుత్వం పెట్టుకున్న పెద్ద లక్ష్యం'' అని తెలిపారు. మహిళా సాధికారతను ప్రభుత్వ విధానాల కేంద్రాంశంగా కొనసాగిస్తామని, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి—మూడింట్లోనూ మహిళలే ముందుండేలా వాతావరణం సృష్టిస్తామని హామీ ఇచ్చారు.



**మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇందిరమ్మ చీరలు ధరించాలి**

ఈ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌లుగా మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా అధికారులు ముందుకు రావాలని సీఎం కోరారు. “మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే ఈ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్లు కావాలి. అందరి ముందూ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి'' అని పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ స్ఫూర్తి**

సీఎం ప్రసంగంలో అనేకసార్లు ఇందిరాగాంధీ పేరు వినిపించింది. ఈ పథకం కేవలం సంక్షేమ కార్యక్రమమే కాకుండా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చరిత్రను ప్రజలకు గుర్తుచేసే ప్రయత్నం కూడా అనే రాజకీయ వర్గాల అభిప్రాయం. ఇందిరా గాంధీ సంప్రదించిన మహిళా సంక్షేమ భావజాలాన్ని కొత్త తెలంగాణలో మళ్లీ నిలబెట్టాలని రేవంత్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా కనిపిస్తోంది.

కార్యక్రమంలో వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్న నేపథ్యంలో భద్రతా, వాహన రవాణా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశారు. డిప్యూటీ సీఎం, అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనడంతో కార్యక్రమం రాజకీయపరంగానూ పెద్ద ఊపును సంతరించుకుంది.

**రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహం**

కార్యక్రమం ప్రారంభం కాగానే తెలంగాణలోని అన్ని జిల్లాలలోని అధికారులతో ప్రభుత్వం సమావేశాలు నిర్వహించింది. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసి చీరల రవాణా, పంపిణీ, లబ్ధిదారుల నమోదు వంటి పనులను వేగవంతం చేశారు. కొన్ని చోట్ల మహిళలు ముందుగానే భారీగా నమోదై కార్యక్రమంపై ఆసక్తి చూపుతున్నారు.



# పుట్టపర్తి పవిత్ర భూమి..

మొదటిపేజీ తరువాయి

రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు. ప్రేమ, శాంతితో కూడిన వసుదైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలందించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు.



# నేనొక్కడినే.. ఏం చేసుకుంటారో చేసుకోండి..

- 10 దేశాలకు పైరసీ, బెట్టింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించిన వైనం
- కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- ఆదాయంలో 80 శాతం బెట్టింగ్ యాప్‌ల ద్వారానేనని గుర్తింపు
- ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి

**హైదరాబాద్, నవంబర్ 19**

ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడిగా భావిస్తున్న ఇమంది రవి అరెస్టుతో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం సినిమా పైరసీ మాత్రమే కాకుండా 10 దేశాల్లో నెట్‌వర్క్ ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ ద్వారా వందల కోట్ల రూపాయల మేర అక్రమ దందా నడిపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. కేసు వివరాలను తమకు అందించాలని హైదరాబాద్ పోలీసులను కోరింది.గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన రవి, తన జీతం సరిపోకపోవడంతో పాటు, భార్య, అత్తమామలు చులకనగా మాట్లాడటంతో సులభంగా డబ్బు సంపాదించాలని పైరసీ మార్గాన్ని ఎంచుకున్నట్లు విచారణలో అంగీకరించాడు. "నేను ఒంటరిని, నన్ను పట్టించుకునే వారు లేరు, ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ పోలీసులకే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన అతడిని, కూకట్‌పల్లిలోని నివాసంలో ఉండగా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం రవి తన ఆదాయంలో కేవలం 20 శాతం మాత్రమే పైరసీ ద్వారా, మిగిలిన 80 శాతం ఆదాయాన్ని బెట్టింగ్ యాప్‌లకు యూజర్లను మళ్లించడం ద్వారా సంపాదించాడు. ఈ డబ్బును క్రిప్టో కరెన్సీ, హవాలా మార్గాల్లో విదేశీ ఖాతాలకు తరలించినట్లు గుర్తించారు. ఇప్పటికే అతడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 3.5 కోట్లను స్తంభింపజేశారు. రవి నెట్‌వర్క్‌లో పలువురు విదేశీయులు కూడా ఉన్నారని, వారిపైనా కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రవి, ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉంటున్నాడు. తనను కలిసేందుకు వచ్చిన న్యాయవాదులతో మాట్లాడేందుకు కూడా నిరాకరించాడు. విదేశీ పౌరసత్వం ఉన్న రవి దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉండటంతోనే అరెస్ట్ చేశామని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.






# టైమ్ కూడా ఇవ్వం, జైలుకు పంపిస్తాం

- బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశం
- చిల్లర రాజకీయాలకు భయపడేది లేదు..
- ఇష్టారీతిన కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తామన్న రామచందర్ రావు
- బీజేపీపై ఎవరు పోస్టులు పెట్టినా కౌంటర్ ఇవ్వాలని సూచన
- బీజేపీపై తప్పడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరిక
- పార్టీ కార్యకర్తలకు అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్

**హైదరాబాద్, నవంబర్ 19 :**

పార్టీ కార్యకర్తలకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా సరే ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు. టైమ్ కూడా ఇవ్వం అని, అవసరం అయితే జైలుకు పంపిస్తాం అని కార్యకర్తలతో అన్నారు. కొందరు తాము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వంను అస్సలు చంపుకోవద్దని సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. 'పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం, టైమ్ కూడా ఇవ్వం. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్స్ ద్వారా బీజేపీపై పోస్టులు పెడుతున్నాయి. పార్టీ నేతలు ఒక మంత్రి దగ్గరకు వెళితే.. పిర్యాదు చేసేందుకు వెళ్లారని రాశారు. ఆ పేపర్ మీద రూ.5 కోట్ల పరువు నష్టం దావా వేశాం. మేము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారు. కేసులు పెట్టీ జైలుకు పంపిస్తాం. ఇప్పటికే కేసులు పెట్టాం. పార్టీ మీద ఎవరు పోస్టులు చేసినా కౌంటర్ ఇవ్వండి. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదు. దమ్ముంటే ముందుకు వచ్చి మాట్లాడండి' అని రామచందర్ రావు అన్నారు. 'డబ్బులిస్తే ఏది పడితే అది రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఎవరిని ఉపేక్షించేది లేదు. యూట్యూబ్‌లో మాట్లాడుతున్నారు. ఒకరు దుబాయ్, మరొకరు అమెరికాలో ఉండి తిడుతున్నారు. మీరు ఇండియాకు రండి మీ సంగతి చెబుతాం. పార్టీ కార్యకర్తలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ నేతలు ఎవరిని ప్రోత్సహించినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సిరియస్ యాక్షన్ ఉంటుంది. నా మీద కూడా ఫేక్ వార్తలు వస్తాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలకు వార్నింగ్ ఇస్తున్నా, మా మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయకండి. సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.. మీ వ్యక్తిత్వంను చంపుకోవద్దు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు.

# షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత...

- షేక్ హసీనాకు మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్
- రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసేలా సన్నాహాలు చేపట్టిన బంగ్లాదేశ్
- బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు



**న్యూ ఢిల్లీ, నవంబర్ 19**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని భావిస్తోంది. మానవత్వం మరిచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో షేక్ హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం దేశం విడిచిన షేక్ హసీనా, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేస్తున్నారని బంగ్లాదేశ్ దినపత్రిక 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది.

పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇదివరకే ఇంటర్‌పోల్‌కు అరెస్టు వారెంటుతో పాటు దరఖాస్తు సమర్పించినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గత సంవత్సరం జరిగిన రిజర్వేషన్ల ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఢిల్లీలో గుర్తు తెలియని ప్రాంతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

మొదటిపేజీ తరువాయి

బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాగంటి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు బీఆర్‌ఎస్ అండగా నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు.విషాదంలో ఉన్న హరీశ్‌రావు అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చునన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్టంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్టం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా



ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సాంకేతికంగా మాత్రమే కాంగ్రెస్ గెలుపని.. జూబ్లీహిల్స్‌లో నైతిక గెలుపు సునీత, బీఆర్‌ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్‌ఎస్ నేతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18వేల ఓట్లు మాత్రమే వచ్చాయని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 75వేల ఓట్లు సంపాదించామని తెలిపారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని కాంగ్రెస్ గుర్తించిందని.. బీఆర్‌ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని, బీఆర్‌ఎస్‌ను చూసి కాంగ్రెస్ పార్టీ గడగడలాడిపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, మజ్లిస్ ఒక వైపు, బీఆర్‌ఎస్ పార్టీ ఒంటరి పోరాటం చేసిందన్న హరీశ్.. అధికార దుర్వినియోగంతో గెలిచిన విషయం రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓడిపోయినా తర్వాత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచిందన్నారు. త్వరలోనే మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. కేటీఆర్, తలసాని సహా తామంతా కలిసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జీహెచ్‌ఎంసీ, ఇతర ఎన్నికలకు సిద్ధంగా ఉందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ.. కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

అధికారుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఖట్టర్ విలేకరులతో మాట్లాడారు. "మెట్రో విస్తరణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఏ లైన్లకు ఆమోదం తెలపాలనే దానిపై మార్చి నాటికి కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది" అని ఖట్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు ప్రాథమికంగా అంగీకారానికి వచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మెట్రోను విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

**విశాఖ, విజయవాడ మెట్రోలు, అమరావతి అభివృద్ధి**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో ప్రాజెక్టులకు డిమాండ్ ఉందని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని ప్రధాన నగరంగా అభివృద్ధి చేసే ఆలోచన కూడా కేంద్రానికి ఉందని, ప్రస్తుత ప్రణాళికల ఆధారంగా అవసరమైన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు.

**మూసీ ప్రక్షాళనకు కేంద్రం చేయూత**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపైనా ఖట్టర్ మాట్లాడారు. "మొదటి దశలో 9 కిలోమీటర్ల మేర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతి 5 కిలోమీటర్లకు ఒక మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. మూసీ ప్రక్షాళనకు అమృత్ పథకం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా నిధులు సమకూరుస్తాం" అని వివరించారు. ఇదే సమయంలో, పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్రాలు సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ నది నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఒక టెస్టింగ్ ల్యాబొరేటరీకి ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోకు 50:50 వాటా పద్ధతిపై చర్చలు జరిగాయని ధ్రువీకరించారు.





# ఓటర్ జాబితా సవరణపై ఈసీ ఆదేశాలు

- **ఓటరు జాబితా సవరణకు షెడ్యూలును ప్రకటించిన ఎన్నికల సంఘం**
- **ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ**
- **జిల్లా పంచాయతీ అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు**

**ప్రజాస్వరం, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను ప్రకటించింది. రేపటి నుంచి ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసే అవకాశం ఉంది. సోమవారం మంత్రి మండలిలో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించిన నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఎన్నికల సంఘం ఈ మేరకు దృష్టిసారించాయి.



# హిడ్మాను చంపి.. ఎన్‌కౌంటర్ అంటారా

- **మావోయిస్టులపై దాడులను వెంటనే ఆపాలి**
- **సిపిఐ నేత కూనంనేని డిమాండ్**

**హైదరాబాద్, నవంబర్ 19**



మావోయిస్టు అగ్ర నేత హిడ్మాను చంపి.. దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల అంశంపై చర్చించేందుకు గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లమని అన్నారు. అతన్ని తానే డీజీపీకి సరెండర్ చేయించేవాడిని అని పేర్కొన్నారు. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలు తెలుసుకోవాలని కూనంనేని సూచించారు. ఇలా చంపడం సరికాదని.. అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలని అన్నారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు తెలుస్తోందని.. అసలు పోలీసుల చెరలో ఎంతమంది ఉన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదేమైనా యుద్ధమా అని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపద కోసమే ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తుందని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా బండి సంజయ్ ఎన్‌కౌంటర్‌గా చెప్పడం దారుణమని మండిపడ్డారు. హింసను వీడి, శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

# సింగరేణి ముట్టడి ఉద్రిక్తం

- **జాగృతి నేతలు, పోలీసుల మధ్య తోపులాట**
- **బైఠాయించిన కవిత**
- **కవిత అరెస్టు, నాంపల్లి పీఎస్ కు తరలింపు**
- **మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలి**
- **సింగరేణిలో ఇండిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించాలి**
- **జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత డిమాండ్**

**హైదరాబాద్, నవంబర్ 19:**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక్కసారిగా జాగృతి నేతలు కార్యకర్తలు తరలిరావడంతో అలర్టు అయిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే తరలి వచ్చారు. దీంతో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సింగరేణి భవన్ ముందు బుధవారం బైఠాయించారు. సింగరేణి ఇండిపెండెంట్ ఉద్యోగాలు వెంటనే పునరుద్ధరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. వెళ్లిపోవాలని పోలీసులు చెప్పినప్పటికీ అక్కడే కూర్చోవడంతో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులకు, జాగృతి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కవితను సైతం పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణి అంశంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సంస్థ కార్మికులపై మాట్లాడడం లేదని విమర్శించారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం వేలం పాటతో సంబంధం లేకుండా బొగ్గు బ్లాకులు కేటాయించాలని, ఏడాదికి 5 నూతన భూగర్భ గనులు తెరిచి, పరుగు పందెంతో నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్టుల్లో గనుల్లో ప్రైవేట్ వారితో కాకుండా కంపెనీ కార్మికులతో నడిపించాలని, అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను, జెన్ కో, ట్రాన్స్ కో మాదిరిగా రెగ్యూలర్ చేయాలని కోరారు. కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు అలవెన్సులపై ఇన్ కాంటాక్స్ ను యాజమాన్యం తిరిగి కార్మికులకు చెల్లించాలన్నారు. పాత వీఆర్ఎస్ స్కీంను పునరుద్ధరించాలని, రెండేళ్ల సర్వీస్ ఉన్న కార్మికులకుందరిని అన్ ఫిట్ చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సింగరేణియే హౌజింగ్ బోర్డు సొసైటీ ఏర్పాటు చేసి స్వంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేనిలో భూ నిర్వాసితులకు, కాంట్రాక్టు కార్మికులకు వెంటనే శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా సంస్థలో అవినీతి నిర్మూలనకు, రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు.



# ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పాటుపడాలి

- **ఘనంగా మాజీ ప్రధాని ఇందిర గాంధీ జయంతి వేడుకలు.**
- **ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన చిన్నారెడ్డి.**

**వనపర్తి, నవంబర్ 19:**

భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పాటుపడాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆమె జయంతి వేడుకలను పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్కులో గల ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ 19 నవంబర్ 1917న జన్మించారని చెప్పారు. నాడు ఆమె ప్రవేశపెట్టిన సంస్కరణలు ఇప్పుడు భారతదేశ అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ యాదయ్య,డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్,ప్రభుత్వ న్యాయవాది కిరణ్ కుమార్,ఖమర్ మియా, జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్,వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు,మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు సమద్,అక్తర్,బాబా, పెంటన్న యాదవ్,సహదేవ్ యాదవ్,కోళ్ల వెంకటేష్,హనీఫ్, గడ్డం వినోద్ యాదవ్,జానంపేట నాగరాజు ,సురేష్ గౌడ్, పెద్దకోటయ్య,పెండెం మన్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్పస్వాములకు కేరళలో అవమానం..

**హైదరాబాద్, నవంబర్ 19:**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అయ్యప్ప స్వాములకు సంబంధించి ఒక విజ్ఞప్తి చేశారు. అయ్యప్ప మాల వేసుకుని వెళ్లిన తెలుగువారికి ప్రతి సంవత్సరం ఏదో రకంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి విషయంలో చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లిన వారికి కేరళలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాకు చెందిన అయ్యప్ప స్వాములు సమూహంగా వెళ్లగా, వారికి దారి తెలియక పోలీసులను అడ్రస్ అడిగితే అసభ్యకరంగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ పోలీసులు, ప్రభుత్వం నుంచి మన స్వాముల ప్రతి సంవత్సరం ఈ తరహా అవమానాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.అందుకే, తెలుగు స్వాములకు ఇబ్బందులు తలెత్తకుండా తెలుగు రాష్ట్రాల ప్రతినిధి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి తిరుపతికి వెళితే ఇక్కడికి చెందిన కోఆర్డినేటర్ ఉంటారని, ఈ తరహా సదుపాయం కేరళలోనూ ఏర్పాటు చేయాలని చంద్రబాబు, రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గోదావరి జిల్లా భక్తుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేరళ పోలీసులపై చర్యలు తీసుకునేలా చంద్రబాబు అక్కడి వారితో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, పోలీసులతో మాట్లాడాలని రాజాసింగ్ అన్నారు.



# ప్రజా సేవకు ప్రాణాలర్పించిన వీర వనిత ఇందిరా గాంధీ

- **ఎమ్మెల్యే మేఘారెడ్డి.**
- **వనపర్తిలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.**

**వనపర్తి, నవంబర్ 19:**

ప్రజా సేవ కోసం ప్రాణాలర్పించిన వీర వనిత ఇందిరా గాంధీ అని ఎమ్మెల్యే మేఘారెడ్డి కొనియాడారు. బుధవారం ఆమె జయంతిని పురస్కరించుకొని ఇందిరాపార్కులో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ ధీరశాలి అయిన ఇందిరాగాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని సూచించారు. దేశంలో హరిత విప్లవం తీసుకొచ్చి పంటల దిగుబడి పెంచి అన్నదాతల శ్రేయస్సు కోసం పాటుపడిన వ్యక్తి ఇందిరాగాంధీ అని అన్నారు. బ్యాంకులను జాతీయ కరణ చేసి నిరుపేదలకు బ్యాంకు సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. గరీబి హటావో అని నినదించి సీలింగ్ యాక్ట్ ను తీసుకువచ్చి భూమిలేని నిరుపేదలకు సాగు భూమిని అందించి నిరుపేదల అభ్యున్నతికి పాటు పడ్డారని చెప్పారు.కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,పార్టీ పట్టణ అధ్యక్షులు చందర్,బ్రహ్మం చారి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు ఓటేస్తే పంచాయతీలకు నయా పైసా రాదు..

- **హిందుత్వమే నా శ్వాస... రామరాజ్యం తెస్తాం...**
- **హుజూరాబాద్‌లో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**

**కరీంనగర్, నవంబర్ 19:**

హిందుత్వమే నా శ్వాస... రామరాజ్యం తెస్తామని హుజూరాబాద్‌లో కేంద్ర హోమ్ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ లో కరీంనగర్ స్థాయిస్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి సంజయ్ మాట్లాడుతూ "హిందుత్వమే నా శ్వాస, నా నోటి నుండి హిందుత్వం ఆగిపోతే ఆ రోజే నా శ్వాస ఆగిపోయినట్లు" అని స్పష్టం చేశారు. హిందుత్వంతోనే తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చి, రాష్ట్రంలో రామరాజ్యాన్ని స్థాపిస్తామని ప్రకటించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 4 నుండి 48 సీట్లు గెలవడానికి, తాను కరీంనగర్ ఎంపీగా విజయం సాధించడానికి హిందుత్వమే కారణమని గర్వంగా చెప్పారు. ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా మోదీ ప్రభుత్వం అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నప్పటికీ, ఎన్నికలొస్తే మసీదుల్లో ముస్లింలంతా ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా ఓటేస్తున్నారన్నారు. వారు ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరారు. 12 శాతం ముస్లింలు ఒక్కటై ఓటు బ్యాంకుగా మారితే తప్పు లేనిది, 80 శాతం హిందువులు ఏకమై ఓటు బ్యాంకుగా మారితే తప్పేంటని ఆయన సూటిగా ప్రశ్నించారు. "నేను బరాబర్ మతతత్వ వాదినే" అని ధైర్యంగా ప్రకటిస్తూ, ఇదే హిందుత్వ వాదంతో గడపగడపకూ తిరుగుతానని తెలిపారు. ముస్లిం మహిళలకు మేలు చేసే ట్రిపుల్ తలాక్ రద్దును కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతూ, కేవలం కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ పంచాయతీకి కూడా నయాపైసా ఇవ్వలేదని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేస్తే పంచాయతీలకు నిధులు రావని అన్నారు. పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని, అందుకే బీజేపీని గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హుజూరాబాద్ సహా పలు ఆసుపత్రులకు రూ.5 కోట్ల సీఎస్సార్ నిధులు, హుజూరాబాద్ స్టేడియం కోసం రూ.10 కోట్లు, గన్నేరువరం బ్రిడ్జి కోసం రూ.70 కోట్లు కేంద్ర నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. బీజేపీని గెలిపిస్తే పంచాయతీలకు నిధులు తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ ఫెస్టివల్' నిర్వహించడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఇది 'తెలంగాణ డౌన్ ఫాల్ ఫెస్టివల్' అని విమర్శించారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర డిక్లరేషన్లు (వరంగల్, యూత్, ఎస్సీ/ఎస్టీ, కామారెడ్డి) ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండేళ్ల కాంగ్రెస్ వైఫల్యాలు, పదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ఈనెల 26న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి 'సంతకాల సేకరణ' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ పై రూపొందించిన 'బలిరా... భళి భళిరే' గీతాన్ని విడుదల చేయగా, బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంగా చిందులేశారు. కాగా హిందుత్వంపై బండి చేసిన వాఖ్యలు ఈటల రాజేందర్ చేసిన వాఖ్యపై కౌంటర్ గా మాట్లాడినట్టు చర్చ సాగుతుంది.



# నాసా వదిలి వ్యవసాయంలోకి!

**పీహెచ్‌డీ చదివినవారూ సాగు బాట**

**ఇంత గొప్పవారిని చూడటం మంచి అవకాశం**

**కోయంబత్తూర్‌లో ప్రధాని మోదీ**

కోయంబత్తూర్: నాసాలో ఉద్యోగం విడిచి వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్న వారిని తాను చూశానని, తాను తమిళనాడుకు రాకపోతే ఇవన్నీ చూసే అవకాశం కోల్పోయేవాడినని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ, తనకంటే ముందే బీహార్ గాలి తమిళనాడుకు వచ్చిందని పేర్కొన్నారు. రైతులు తనను పలకరించేందుకు తమ చేతిలోని కండువాను ఊపడంతో తనకు ఆ భావన కలిగిందని తెలిపారు.నేను వేదికపైకి రాగానే రైతులు తమ చేతి కండువాను గాల్లోకి ఊపారని, తాను రావడానికి ముందే బీహార్ గాలి ఇక్కడకు వచ్చిందని ఆ దృశ్యాన్ని చూసి అర్థం చేసుకున్నానని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కోయంబత్తూరు జౌళి పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉన్నారని గుర్తు చేశారు. వ్యవసాయం తన మనసుకు ఎంతో దగ్గరగా ఉంటుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఇక్కడ తాను ఒక ఎగ్జిబిషన్ చూశానని, అందులో చాలా మంది రైతులతో మాట్లాడే అవకాశం తనకు లభించిందని అన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్, పీహెచ్‌డీ చదువుకున్న వారు కూడా వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. నాసాలో ఉద్యోగం విడిచి వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్న వారిని తాను చూశానని, వారు యువతకు నైపుణ్యాలు నేర్పుతున్నారని అన్నారు. ఇక్కడకు రాకపోయి ఉంటే వాటిని చూసే అవకాశం ఉండేది కాదని, ఈ విషయాన్ని తాను బహిరంగంగా అంగీకరిస్తున్నానని అన్నారు. వారి ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు.



## తుది దశకు భారత్-అమెరికా చర్చలు

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి**



న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకుంటున్నాయి. ఒప్పందం న్యాయంగా, సమానంగా, సమతుల్యంగా కుదిరిన వెంటనే శుభవార్త వెలువడుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూచనప్రాయంగా వెల్లడించారు. ఇండో-అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఆర్థిక సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందంలో భారత రైతులు, మత్స్యకారులు, చిన్న పరిశ్రమల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తామని గోయల్ స్పష్టం చేశారు. “మన దేశ ప్రయోజనాలను కాపాడుకోవాలి. రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన, సమానమైన పరిష్కారం లభించినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తాయి. అప్పుడు మీరు శుభవార్త వింటారు” అని ఆయన వివరించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇప్పటికే ఆరు రౌండ్ల చర్చలు పూర్తయ్యాయని గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని, అమెరికా నుంచి ఎల్పీజీ దిగుమతి వంటి దీర్ఘకాలిక ఒప్పందాలు భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నాయని అన్నారు. ఈ స్నేహం శాశ్వతంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత 191 బిలియన్ డాలర్ల నుంచి 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అమెరికా నుంచి బాదం, పిస్తా, యాపిల్స్ వంటి ఉత్పత్తులకు భారత మార్కెట్లో ప్రవేశం కల్పించాలని ఆ దేశం కోరుతోంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమెరికా వరుసగా నాలుగోసారి భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచిన విషయం తెలిసిందే.

## బ్యాంకుల నుంచి ‘1600’ సిరీస్‌తోనే కాల్స్

**దేశంలోని బ్యాంకులకు ట్రాయ్ ఆదేశాలు**

**వివిధ సంస్థలకు దశలవారీగా గడువు**

**బీమా సంస్థలకు గడువుపై ఐఆర్‌డీఏఐతో చర్చలు**

న్యూఢిల్లీ: దేశంలో నానాటికీ పెరిగిపోతున్న స్పామ్, మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగంలోని సంస్థలతో పాటు ప్రభుత్వ విభాగాలు తమ సర్వీస్, లావాదేవీల కాల్స్ కోసం తప్పనిసరిగా ‘1600’ తో మొదలయ్యే నంబర్ సిరీస్‌ను ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల వినియోగదారులు ఏది అసలైన కాల్, ఏది మోసపూరిత కాల్ అనేది సులువుగా గుర్తించగలుగుతారు. ఈ కొత్త నిబంధనను దశలవారీగా అమలు చేసేందుకు ట్రాయ్ గడువులను నిర్దేశించింది. వాణిజ్య బ్యాంకులు (ప్రభుత్వ, ప్రైవేట్, విదేశీ) 2026, జనవరి 1 నాటికి ఈ సిరీస్‌కు మారాల్సి ఉంటుంది. రూ.



5,000 కోట్లకు పైగా ఆస్తులున్న పెద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, పేమెంట్స్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు 2026, ఫిబ్రవరి 1 గడువుగా విధించారు. మ్యూచువల్ ఫండ్లు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు 2026, ఫిబ్రవరి 15 వరకు సమయం ఇచ్చారు. మిగిలిన ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు 2026, మార్చి 1 తుది గడువుగా నిర్ణయించారు. క్వాలిఫైడ్ స్టాక్‌బ్రోకర్లు , 2026 మార్చి 15 నాటికి ఈ మార్పు పూర్తి చేయాలి. ఇప్పటికే దాదాపు 485 సంస్థలు ‘1600’ సిరీస్‌లో 2800కి పైగా నంబర్లను వినియోగిస్తున్నాయని ట్రాయ్ తెలిపింది. అయినప్పటికీ, కొందరు ఇప్పటికీ పాత 10-అంకెల నంబర్లను వాడుతూ ఉండటంతో మోసాలకు ఆస్కారం ఏర్పడుతోందని భావించిన ట్రాయ్, ఈ మార్పును తప్పనిసరి చేసింది. ఇక బీమా రంగానికి సంబంధించిన గడువుపై ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని ట్రాయ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కొత్త నిబంధన అమలుతో వినియోగదారుల ఆర్థిక భద్రత మెరుగుపడటంతో పాటు, సంస్థల పేరుతో జరిగే మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఆరంభంలో నష్టాలతో ట్రేడింగ్ ప్రారంభించినప్పటికీ, చివరికి బలంగా పుంజుకుని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఐటీ, ఎంపిక చేసిన లార్జ్-క్యాప్ షేర్లలో భారీ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు బలపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 513.45 పాయింట్లు పెరిగి 85,186.47 వద్ద, నిఫ్టీ 142.60 పాయింట్లు లాభపడి 26,052.65 వద్ద స్థిరపడ్డాయి. ఉదయం సెషన్ నెగటివ్‌గా 84,643 వద్ద మొదలైన సెన్సెక్స్, ఒక దశలో మరింత బలహీనపడింది. అయితే, కనిష్ఠ స్థాయిల నుంచి 700 పాయింట్లకు పైగా కోలుకుని 85,236 వద్ద రోజు గరిష్ఠాన్ని తాకింది. ఆషికా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ విశ్లేషణ ప్రకారం, నిఫ్టీ 25,850 మద్దతు స్థాయి వద్ద బలమైన కొనుగోళ్ల మద్దతును పొందింది. అక్కడి నుంచి బుల్స్ పట్టు సాధించి, కీలకమైన 26,000 మార్కును తిరిగి అందుకున్నాయని పేర్కొంది. కేంద్ర వాణిజ్య మంత్రి చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై



కొత్త ఆశలు చిగురించడమే మార్కెట్ల పునరుత్తేజానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో విలువ ఆధారిత కొనుగోళ్లు పెరిగాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 2.97 శాతం మేర భారీగా ఎగబాకింది. బ్యాంక్, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు కూడా లాభపడ్డాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. అయితే, బ్రాడర్ మార్కెట్‌లో మిడ్‌క్యాప్ షేర్లలో స్వల్ప కొనుగోళ్లు కనిపించగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.43 శాతం మేర నష్టపోయింది.

## భారత్‌పై చైనా నకిలీ ప్రచారం

**ఆపరేషన్ సిందూర్‌పై దుష్ప్రచారం**

**రాఫెల్ విశ్వాసాన్ని దెబ్బతీసే కుట్ర**

**జే-35 విమానాలకు డిమాండ్ కోసమే**

**అమెరికా కాంగ్రెస్ సంచలన నివేదిక**




న్యూయార్క్: పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో, పాకిస్థాన్ మరియు పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై జరిగిన ఈ సైనిక చర్యపై అమెరికా కాంగ్రెస్ నిపుణుల సంఘం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో పలు సంచలన అంశాలను వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత, కృత్రిమ మేధను ఉపయోగించి భారత్‌ను లక్ష్యంగా చేసుకుని చైనా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిందని ఆరోపించింది. అమెరికా-చైనా ఆర్థిక, భద్రతా సమీక్ష కమిషన్ తన వార్షిక నివేదికలో ఈ సంచలన అంశాలను ప్రస్తావించింది. నివేదిక ప్రకారం, చైనా కృత్రిమ మేధస్సును ఉపయోగించి నకిలీ చిత్రాలను సృష్టించి, ఫేక్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా వాటిని ప్రచారం చేసింది. తాము తయారు చేసిన క్షిపణులు భారత్, ఫ్రాన్స్ (రఫేల్) యుద్ధ విమానాలను కూల్చివేశాయని చైనా ప్రచారం చేసుకుంది. దీని వెనుక ఒక వ్యూహం ఉందని, ప్రపంచవ్యాప్తంగా రఫేల్ యుద్ధ విమానాలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయడమే ఈ ప్రచారం యొక్క ముఖ్య ఉద్దేశమని నివేదిక అభిప్రాయపడింది. అదే సమయంలో, తన సొంత జే-35 యుద్ధ విమానాలకు డిమాండ్ పెంచుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. చైనా అనుసరిస్తున్న గ్రే జోన్ వ్యూహంలో అసత్య ప్రచారం ఒక భాగమని ఈ నిపుణుల సంఘం తన నివేదికలో పేర్కొంది. భారత్-పాకిస్థాన్ మధ్య ఆరు నెలల క్రితం చోటు చేసుకున్న ఉద్రిక్తతలను ఆసరాగా చేసుకుని, చైనా తన ఆయుధ సంపత్తిని గొప్పగా చూపించుకునే ప్రయత్నం చేసిందని తెలిపింది. ప్రత్యక్ష సైనిక ఘర్షణ లేకుండానే భౌగోళిక రాజకీయాలపై ప్రభావం చూపడానికి చైనా వ్యూహాలను రచిస్తుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

## ముద్దుపెట్టబోతే నాలుక కొరికిన మాజీ ప్రేయసి

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఒక వ్యక్తి తనపై లైంగిక దాడికి ప్రయత్నించి, బలవంతంగా ముద్దు పెట్టబోయినందుకు ఆ వ్యక్తి నాలుకను ఓ యువతి కొరికేసిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం చంపి (35) అనే వివాహితుడు అదే ప్రాంతానికి చెందిన ఒక యువతితో గతంలో ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. అయితే, ఆ యువతికి ఆమె తల్లిదండ్రులు వేరొకరితో వివాహం నిశ్చయించడంతో అతనికి దూరంగా ఉండటం మొదలు పెట్టింది. ఈ పరిణామం తట్టుకోలేని చంపి ఆమెను కలుసుకోవడానికి తరచూ ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆమె గ్రామ సమీపంలోని చెరువు వద్దకు ఒంటరిగా వెళ్లడం గమనించాడు. వెంటనే ఆమెను వెంబడించి, అదును చూసి ఆమెను పట్టుకుని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించినా వినకుండా బలవంతంగా ముద్దు పెట్టడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో తీవ్రంగా ప్రతిఘటించిన యువతి అతని నాలుకను బలంగా కొరికేసింది. దాంతో నాలుకలో కొంత భాగం తెగిపోయి తీవ్ర రక్తస్రావం అయింది. చంపి బాధతో గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అతడిని వెంటనే సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌లోని మరొక పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దినేష్ త్రిపాఠి స్పందిస్తూ నిందితుడు చంపిపై కేసు నమోదు చేశామని, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామనితెలియజేశారు.

## పుల్వామా చెరువులో ఢిల్లీ సూసైడ్ బాంబర్ ఫోన్

పుల్వామా: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ మహమ్మద్ అలియాస్ నబీకి సంబంధించిన వీడియోపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతను ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ రికార్డ్ చేసిన వీడియో ఘటన జరగడానికి కనీసం వారం రోజుల ముందే చిత్రీకరించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ వివరాలను ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఆ వీడియో ఉన్న ఫోన్‌ను నబీ తన సోదరుడికి ఇవ్వగా, అతను భయంతో దాన్ని ఓ చెరువులో పడేసినట్లు తేలింది. నవంబర్ 10న కారు బాంబు దాడికి పాల్పడటానికి వారం ముందు, నబీ జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న తన ఇంటికి వెళ్లాడు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అతడు, తిరిగి వెళ్లే ముందు తన రెండు ఫోన్లలో ఒకదాన్ని తన సోదరుడికి ఇచ్చాడు. అయితే, నబీ సహోద్యోగులైన డాక్టర్ ఆదిల్ అహ్మద్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షహీన్ సయీద్‌లను ఉగ్రవాద సంబంధిత ఆరోపణలపై పోలీసులు వరుసగా అరెస్ట్ చేయడంతో నబీ సోదరుడు భయాందోళనలకు గురయ్యాడు. తన అన్న కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారని తెలియడంతో, ఆ ఫోన్‌ను ఇంటి దగ్గర్లోని చెరువులో పడేశాడు. నబీకి చెందిన రెండు ఫోన్ల సిగ్నల్స్ ట్రేస్ చేయగా, ఒకటి ఢిల్లీలో, మరొకటి పుల్వామాలో స్విచ్ ఆఫ్ అయినట్లు అధికారులు గుర్తించారు. పుల్వామాలోని నబీ ఇంటికి చేరుకుని అతని సోదరుడిని విచారించగా అసలు విషయం బయటపడింది. ఆ తర్వాత చెరువు నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నీటిలో పడటంతో ఫోన్ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, ఫోరెన్సిక్ నిపుణులు కొన్ని రోజుల తర్వాత దాని నుంచి వీడియోను విజయవంతంగా రికవరీ చేశారు. ఆ వీడియోలో, ఇస్లాంలో ఆత్మహత్య నిషిద్ధమైనప్పటికీ, ఇలాంటి దాడులను “అమరవీరుల చర్యలు”గా అభివర్ణిస్తూ నబీ మాట్లాడాడు. “మరణానికి భయపడకండి, జరగాల్సింది జరిగి తీరుతుంది” అని అతను అందులో పేర్కొన్నాడు. ఈ దాడి వెనుక పక్కా ప్రణాళిక ఉందని ఈ వీడియో రుజువు చేస్తోందని అధికారులు తెలిపారు.

## అల్ ఫలాహ్ వర్సిటీ నుంచి 10 మంది మిస్సింగ్?

న్యూఢిల్లీ: ఢిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయినట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. కనిపించకుండా పోయిన వ్యక్తుల ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అని వస్తున్నాయి. ఇందులో ముగ్గురు కశ్మీరీలు ఉన్నారని తెలుస్తోంది. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టైన నిందితులకు ఈ విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్నట్లు విచారణలో బయటపడింది. తాజాగా, పదిమంది కనిపించకుండా పోవడం గమనార్హం. విశ్వవిద్యాలయం నుంచి కనిపించకుండా పోయిన వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయని, వీరిలో ముగ్గురు కశ్మీరీ వాసులు ఉన్నారని నిఘా వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వచ్చాయి. ఢిల్లీలోని పేలుడు ఘటనతో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఢిల్లీ కారు పేలుడు కేసులో ఈ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులు సహా తొమ్మిది మంది అరెస్టయ్యారు.

## మా అమ్మను అప్పగిస్తే చంపేస్తారు

**షేక్ హసీనా కుమారుడు ఆందోళన**



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తల్లిని బంగ్లాదేశ్‌కు అప్పగిస్తే అక్కడి మిలిటెంట్లు ఆమెను చంపేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తన తల్లికి భద్రత కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సరిహద్దుల్లో ఉగ్రవాదం పెరిగిపోతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని భారత్‌ను హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాజీబ్ మాట్లాడుతూ.. తన తల్లిని అప్పగించాలన్న బంగ్లాదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుత బంగ్లా ప్రభుత్వం న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. తన తల్లిపై తప్పుడు కేసులు బనాయించారని, 17 మంది న్యాయమూర్తులను తొలగించి, పార్లమెంట్ ఆమోదం లేకుండానే చట్టాలను సవరించి విచారణ జరుపుతున్నారని విమర్శించారు. కనీసం డిఫెన్స్ లాయర్లను కూడా కోర్టులోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. “భారత్ మా అమ్మ ప్రాణాలను కాపాడింది. ఆమె బంగ్లాదేశ్ విడిచిపెట్టకపోయి ఉంటే, మిలిటెంట్లు ఆమెను చంపేసేవారు” అని సాజీబ్ అన్నారు. ప్రస్తుత యూనుస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హసీనా హయాంలో అరెస్టయిన వేలాది మంది ఉగ్రవాదులను విడుదల చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. బంగ్లా ఉగ్రవాదంపై ప్రధాని మోదీ కూడా తీవ్ర ఆందోళనతో ఉన్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తన తల్లిని అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం చేసిన అభ్యర్థనను భారత్ తిరస్కరిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.

## వైట్‌హౌస్ విందుకు మస్క్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ల మధ్య విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. గతంలో ఓ బిల్లు విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడంతో, మస్క్ వైట్‌హౌస్‌కు దూరంగా ఉంటున్నారు. అయితే, ఈ గొడవల తర్వాత తొలిసారిగా ఎలాన్ మస్క్ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టడం రాజకీయ, వ్యాపార వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ దాదాపు ఏడేళ్ల తర్వాత అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గౌరవార్థం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులను ఆహ్వానించగా, వారిలో ఎలాన్ మస్క్ కూడా ఉండటం విశేషం. ట్రంప్ ఆహ్వానం మేరకు మస్క్ ఈ విందులో పాల్గొన్నారు. ఈ విందుకు మస్క్‌తో పాటు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు కూడా హాజరయ్యారు. ఒకప్పుడు ప్రభుత్వ విధానాలపై విభేదించి సలహా మండలి నుంచి వైదొలిగిన మస్క్, ఇప్పుడు మళ్లీ ట్రంప్ ఇచ్చిన విందులో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో వీరిద్దరి మధ్య దూరం తగ్గిందనే చర్చ మొదలైంది.

## ఉగ్రవాదిని చితకబాదిన ఖైదీలు

సబర్మతి: ఆముదం గింజల నుంచి అత్యంత ప్రమాదకర విషం (రైసిన్) తయారు చేసి అమాయకుల ప్రాణాలు తీయాలని చూసిన ఉగ్రవాది అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ పై జైలులో దాడి జరిగింది. అహ్మద్ ను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం అతడు గుజరాత్ లోని సబర్మతి జైలులో హైసెక్యూరిటీ బ్యారక్ లో ఉన్నాడు. అయితే, ఏం జరిగిందనే విషయంపై పూర్తి సమాచారం లేనప్పటికీ అహ్మద్ పై తోటి ఖైదీలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలుస్తోంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని, ఖైదీలు ఎందుకు దాడి చేశారనే విషయంపై ఆరా తీస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఖైదీలు మూకుమ్మడిగా దాడి చేయడంతో అహ్మద్ ప్రాణాలు కాపాడేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని సమాచారం. దాడి గురించిన సమాచారం అందిన వెంటనే గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ బృందం సబర్మతి జైలుకు చేరుకుంది. దాడి ఎలా, ఎందుకు జరిగిందనే అంశంపై దర్యాప్తు ప్రారంభించింది.

## జియో యూజర్లకు జెమినీ ప్రో ఫ్రీ

**రూ.35,100 విలువైన ప్లాన్ ఉచితం**

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో తన 5జీ వినియోగదారులకు భారీ శుభవార్త చెప్పింది. ‘జియో జెమిని’ ఆఫర్‌లో కీలక మార్పులు చేస్తూ, గూగుల్ లేటెస్ట్ ఏఐ మోడల్ ‘జెమిని 3’తో కూడిన ‘జియో జెమిని ప్రో ప్లాన్’ను ఉచితంగా అందిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇప్పటివరకు కేవలం యువతకు మాత్రమే పరిమితమైన ఈ ఆఫర్‌ను ఇప్పుడు అర్హులైన అన్‌లిమిటెడ్ 5జీ వినియోగదారులందరికీ వర్తింపజేసింది. ఈ ఆఫర్ కింద, రూ.35,100 విలువైన జెమిని ప్రో ప్లాన్‌ను జియో 5జీ కస్టమర్లు 18 నెలల పాటు ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా పొందవచ్చు. ఈ కొత్త అప్‌గ్రేడ్ బుధవారం నుంచే అందుబాటులోకి వచ్చింది. అర్హులైన వినియోగదారులు తమ మై జియో యాప్‌లోకి వెళ్లి ‘క్లెయిమ్ నౌ’ బ్యానర్‌పై క్లిక్ చేయడం ద్వారా తక్షణమే ఈ ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ప్రతి భారతీయుడికి అత్యాధునిక ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జియో తెలిపింది. ఇటీవల గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ జెమిని 3ని సెర్చ్, జెమిని యాప్, ఏఐ స్టూడియో వంటి వాటిలో వేగంగా అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. జెమిని 3కి ఫొటోలు, పీడీఎఫ్‌లు, చేతిరాత వంటి ఎలాంటి ఇన్‌పుట్ ఇచ్చినా, దాని ఆధారంగా వెబ్‌సైట్ లేదా ఇంటరాక్టివ్ పాఠం వంటివి సృష్టించగలదని ఆయన వివరించారు. ఈ అధునాతన ఏఐ సేవలను ఇప్పుడు జియో తన కస్టమర్లకు ఉచితంగా అందిస్తోంది.





# "ఇందిర" సేవలు మరువలేనివి..

**బోరంచు శ్రీకాంత్ రెడ్డి**

**ఈకాలం, ఆదిలాబాద్ టౌన్:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మావల లోని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె దేశ ప్రధానిగా చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యంలో అనేక సంస్కరణలు చేసి ప్రజాహిత నిర్ణయాలు తీసుకొని ఈ దేశ ప్రజలకు అమ్మగా ఇందిరా గాంధీ చిరస్మరణీయమని అన్నారు. నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి గా ఇందిరాగాంధీ పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయకరణ వంటి ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకోవడం జరిగిందని అన్నారు. మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఏ విధంగా తమ తమ రంగాల్లో వృత్తి, వ్యవహారపరంగా ఎలా ఉండాలనే దానికి ఇందిరా గాంధీ ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మావల మండల్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఎన్ ఎస్ యు ఐ మండల్ అధ్యక్షులు మరసుకోలా గౌతమ్, వర్కింగ్ ప్రెస్టేండ్ కుదురుపాక సురేష్, టౌన్ వైస్ ప్రెస్టేండ్ అలీమ్, మాజీ కో -ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, సీనియర్ నాయకులు రెండ్ల రాజన్న, కొరటి ప్రభాకర్, రహీమ్ ఖాన్, అన్నం సంటెన్న, ఇమ్రాన్ ఖాన్, ఎండీ వసీం, తదితరులు పాల్గొన్నారు.

# ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప

**అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ**



**షాద్ నగర్, నవంబర్ 19:** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల అనంతరం శ్రీ ఎలిజర్ల ప్రేమశ్రీ శ్రీకాంత్ దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.అంతకుముందు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి అన్నదాత కుటుంబసభ్యలతోపాటు శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరం అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు,కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ స్వామి ,కోశాధికారి దాస క్రిష్ణయ్య,రాఘవేందర్ పడుకోనె, చింటూ స్వామి, మల్చచలం మురళి,కోటిలింగం గౌడ్ స్వామి,వెంకటేష్ గౌడ్ స్వామి, గోలెపు రాఘవేందర్,మరియు అయ్యప్ప స్వామి సన్నిధానం స్వాములు అర్ యన్ రాజు స్వామి,రాజేష్ స్వామి,రవి గౌడ్ స్వామి,తమ్మలి రఘు స్వామి,బాల కృష్ణ స్వామి, జంగయ్య,రాకేష్ యాదవ్,మందిరం మేనేజర్ రాజగోపాల్ తదితర అయ్యప్ప భక్తులు,స్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు(రెవిన్యూ) కలెక్టర్ డి.వేణు..
- సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి
- అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ..

**పెద్దపల్లి, నవంబర్ 19:** వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు(రెవిన్యూ)కలెక్టర్ డి.వేణు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, కుటుంబంలోని పిల్లలు మంచి మార్గంలో నడిచేలా గైడ్ చేయడంలో వయోవృద్ధులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వయో వృద్ధులు తెలియజేసిన సమస్యలలో జిల్లా యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లలో వయో వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్.బి.ఐ నిబంధనలు ప్రకారం రుణాల జారీ అవకాశాలు పరిశీలిస్తామని తెలిపారు. వృద్ధులు తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల ఏదైనా సలహాలు ఉంటే తెలియజేయాలని, వాటిని సానుకూల దృక్పథంతో తీసుకొని పాటించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, నలుగురితో స్నేహ పూర్వకంగా ఉండాలని, వీలైనంత వరకు తమ పనులు తామే చేసుకోవాలని నవ్వుతూ ఉండాలని అదనపు కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతకు ముందు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను, వృద్ధులకు చట్టాలపై సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు చట్టాలలో చేయవలసిన మార్పులపై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను సభా దృష్టికి తీసుకొని వచ్చారు. అనంతరం వయో వృద్ధులను అదనపు కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు డి.ఆర్.డి.ఓ రవీందర్, వయోవృద్ధులు, వయో వృద్ధుల ఆశ్రమాలు నిర్వహించు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కు సన్మానం..



**ఈకాలం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన సిరాజోద్దీన్ ను దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రిమ్స్ కళాశాలలో ఏఓగా విధులు నిర్వహించి ఏడీగా పదోన్నతి పొందారు. మరిన్ని ఉన్నతపదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ఆసుపత్రి కార్యాలయ సూపరిండెంట్ గోపి, మహేందర్, సీనియర్ అసిస్టెంట్స్ రోహిత్ సింగ్, అభిషేక్, ఆఫీస్ సిబ్బంది నరేష్, బండా శ్రీనివాస్, విక్రమ్ మమత, పద్మ హేమలత రాజేశ్వర్, రాజేశ్వరి, మహేందర్, మోహన్, అనుదీప్, రాజు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ డీఎం కార్యక్రమం నేడు

**ప్రజల సమస్యలకు ప్రత్యక్ష స్పందన**



**షాద్‌నగర్, నవంబర్ 19 :** నేడు తేది 20-11-2025 గురువారం, ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు "డయల్ యువర్ డీఎం" కార్యక్రమం నిర్వహించబడనున్నట్టు షాద్‌నగర్ డి-పో మేనేజర్ తెలిపారు. పట్టణ ప్రజలు మరియు పరిసర గ్రామాల ప్రజలు తమ సూచనలు, సలహాలు, సమస్యలను నేరుగా తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది. ప్రజలు నిర్ణీత సమయంలో ఫోన్ నంబర్: 9959226287 కు సంప్రదించి తమ అభ్యర్థనలు తెలియజేయవచ్చు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.

# షాద్‌నగర్ శిశు మందిర్‌లో ఘనంగా వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు



**షాద్ నగర్, నవంబర్ 19:** షాద్‌నగర్ పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశమాత కోసం తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచిత గాథలను స్మరించుకుంటూ, చిన్నారులు ఆమె వేషధారణలో ఏకపాత్రాభినయం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు దొంతు పాండురంగయ్య, కార్యదర్శి నాగిళ్ళ కిషోర్, ప్రధానాచార్యులు వీరేష్ కుమార్ పాల్గొని విద్యార్థుల్లో దేశభక్తి, స్ఫూర్తిని పెంపొందించేలా సందేశాలు అందించారు. మాతాజీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు జన్మదినం

**జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కొండారెడ్డిపల్లి గ్రామస్తులు**



**షాద్ నగర్, నవంబర్ 19:** కేశంపేట్ మండలం మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు పుట్టినరోజు సందర్భంగా కొండారెడ్డిపల్లిలో బుధవారం యువకులు నాయకులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. మా నాయకుడు ఇలాంటి జన్మదిన వేడుకలు 100 జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉన్నతమైన పదవుల తో మండల గ్రామ ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ వేడుకలలో పాల్గొన్న జగన్మోహన్ రెడ్డి ,సుదర్శన్ ,యువనాయకుడు ప్రేమ్ గౌడ్ప ల్లె ఎల్లయ్య ,పల్లె యాదయ్య ,దశరథ్ ,ఆర్ల మహేష్ ,అరవింద్ ప్రజాపతి ,వినోద్ ,సాయి సుమంత్ పాల్గొన్నారు .

# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

- ఆమె సేవలు మరువలేని
- కాంగ్రెస్ నేత గిమ్మ సంతోష్

**ఈకాలం, ఆదిలాబాద్:** దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించిన ఇందిరాగాంధీ తన హయాంలో ఎన్నో నూతన సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశాన్ని ప్రగతి పథాన పయనింపచేసేలా చేసిందని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు అన్నారు. భారత రత్న స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. గరీబీ హఠావో నినాదంతో 20 సూత్రాల పథకం ద్వారా పేదరికాన్ని నిర్మూలించారని కొనియాడారు.భారత్ లో అలీనోద్యమ దేశాల సమావేశంతో పాటు కామన్‌వెల్త్ దేశాల సమావేశాన్ని కూడా నిర్వహించి తద్వారా భారత దేశ కీర్తిని ప్రపంచంలో అత్యున్నత స్థానంలో ఉంచిన మహనీయురాలని కీర్తించారు. ఈ కార్యక్రమంలో రంగినేని శాంతన్ రావు, ఎంఎ షకీల్, లోక ప్రవీణ్ రెడ్డి, కందుల సుఖేందర్, రఫీక్, సురేందర్, గౌతమ్ రెడ్డి, అతీఖ్, తౌసీఫ్, బెదోడ్కర్ మోతీరం, తుమ్మ ప్రకాష్, ఖలీల్ ,రఫీక్ తదితరులు పాల్గొన్నారు.








# వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

# డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి

## సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి



ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'ఆరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. ఆనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు. విశ్వనాథ్ సినిమాల్లో ఎక్కువగా నటించిన తులసికి బాలనటిగా శంకరాభరణం ఎనలేని కీర్తిని తీసుకు వచ్చింది. ఆ తర్వాత చిరంజీవి హీరోగా వచ్చిన శుభలేఖ సినిమాలో సుధాకర్‌కు జోడీగా మెప్పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.




# ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్–మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

# మరో వివాదంలో నటుడు ధనుష్

## టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు





నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు , 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.

# నిన్న అదితి..నేడు శ్రియా

## నకిలీ వాట్సప్ క్రియేట్ చేసిన దుండగులు



నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.

**EEKALAM** vartha, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h. no. 361, bhagyalaxmi colony, medchal malkajgiri, telangana 500054.
Editor: **Devender Nukala.** Cell:**8688339954, 7013439800**, eekalamnews@gmail.com, **RNI(PRGI) No. TGTEL/25/A3149**